ఏలూరులో కరోనా

హోమ్ ఐసోలేషన్‌లో బాధితుడు



ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరులో ఒక కరోనా కేసు నమోదైంది. నగరంలోని ప్రయివేటు వైద్య కళాశాలకు చెందిన ఒక వైద్యునికి పాజిటివ్ రావడంతో అధికారులు హోమ్ ఐసోలేషన్‌లో పెట్టారు. ఇటీవల హైదరాబాద్ నుంచి వచ్చిన ఆయనకు కరోనా లక్షణాలు కనిపించడంతో ర్యాపిడ్ టెస్ట్ నిర్వహించారు. ఆయనకు పాజిటివ్ అని తేలడంతో కిట్ అందజేసి హోమ్ ఐసోలేషన్‌లో ఉంచామని డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ట ప్రజాశక్తికి తెలిపారు.

పంట నష్టం @ 87 వేల ఎకరాలు

రెండు జిల్లాల్లో పంట నష్టం లెక్కలు తేలిపోయాయి. రైతులు 87 వేల ఎకరాల్లో పంటను కోల్పోయారు. వేలాది మంది రైతులు రోడ్డున పడిన పరిస్థితి. మిచౌంగ్ తుపాను దెబ్బకు కౌలురైతులు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. ప్రభుత్వ ఆదేశాలతో వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి కన్పించడం లేదు. పంట కోల్పోయిన రైతుల కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న పాలకులకు కనికరం లేకుండా పోయింది.

రెండు జిల్లాల్లో తేలిన పంటనష్టం లెక్కలు

గ్రామ సచివాలయాల వద్ద జాబితాల ప్రదర్శన

'పశ్చిమ'లో 49,495 ఎకరాల్లో పంట వర్షార్పణం

ఏలూరు జిల్లాలో 37,936 ఎకరాల్లో దెబ్బతిన్న పంట

అనుకోని విపత్తుతో సర్వం కోల్పోయిన కౌలురైతులు

నష్టపరిహారం వాస్తవ సాగుదారునికి అందేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మిచౌంగ్ తుపాను విలయతాండవంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా రైతాంగం తీవ్ర నష్టాలను చవిచూసింది. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేయగా ఏకంగా 87,431 ఎకరాల్లో రైతులు పంటను కోల్పోయినట్లు లెక్క తేలింది. ఈ అంచనాలు కేవలం 33 శాతం నష్టం పైబడిన లెక్కలు మాత్రమే. ఇంకా నష్టపోయిన విస్తీర్ణం పెద్దఎత్తున ఉంది. రంగుమారిన ధాన్యం లెక్కలు ఇందులో లేవు. రంగుమారిన, తడి ధాన్యంతో రైతులకు ఎక్కడా మద్దతు ధర దక్కని పరిస్థితి నెలకొంది. అవేమీ పంటనష్టపరిహారం లెక్కల్లో చేర్చలేదు. రెండు జిల్లాల అధికారులు తుపానుకు దెబ్బతిన్న ఖరీఫ్ పంట లెక్కలను తేల్చి గ్రామ సచివాలయాల వద్ద జాబితాలను ప్రదర్శించి అభ్యంతరాల స్వీకరణ చేపట్టారు. అభ్యంతరాలు పూర్తయిన తర్వాత ప్రభుత్వానికి నష్టం అంచనాలు నివేదించనున్నారు. అధికారులు తేల్చిన లెక్కల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లాలో వరి, మినుము, వేరుశెనగ పంటలకు సంబంధించి 49,495 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. దీనిలో ప్రముఖంగా వరిపంట 47,657 ఎకరాలు నష్టపోగా, మినుము 1,763 ఎకరాలు, వేరుశెనగ 75 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. ఏలూరు జిల్లాలో మొత్తం 37,936 ఎకరాల్లో పంటను రైతులు కోల్పోయారు. దీనిలో అత్యధికంగా వరి పంట 22,045 ఎకరాల్లో ఉండగా, మొక్కజొన్న 4,366.75 ఎకరాలు, మినుము 241.38 ఎకరాలు, పత్తి 2,181.67 ఎకరాలు, వేరుశెనగ 938.75 ఎకరాలు, పొగాకు 8,160 ఎకరాలు, చెరకు రెండెకరాల్లో రైతులు పంటను కోల్పోయారు. రెండు జిల్లాల్లోనూ అత్యధికంగా 69,702 ఎకరాల్లో వరిపంట దెబ్బతింది.

నిబంధనల పేరుతో జాబితాలో చేరని దెబ్బతిన్న పంట

అధికారులు తేల్చిన పంటల లెక్కలు కేవలం 33 శాతానికిపైగా దెబ్బతిన్న పంటలకు సంబంధించినవి మాత్రమే. 20, 30 శాతం ఈవిధంగా నష్టపోయిన పంట ఇంకా వేలాది ఎకరాల్లో ఉంది. 40 బస్తాల దిగుబడి రావాల్సిన పొలాలు దిగుబడి చాలా తగ్గిపోయిన పరిస్థితి ఉంది. ఎకరాకు రూ.35 వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. అయినప్పటికీ 33 శాతంలోపు దెబ్బతిన్న పంట పొలాలను జాబితాలో చేర్చలేదు. దీంతో ఎంతోమంది రైతులు నష్టపోయిన పరిస్థితి నెలకొంది. దెబ్బతిన్న పంటలకు సంబంధించి 90 శాతం కౌలురైతులే ఉన్నారు. అయితే ప్రభుత్వం విధించిన నిబంధనలతో పది శాతం కౌలురైతుల పేర్లు కూడా నష్టపరిహారం జాబితాలోకి చేరలేదు. దీంతో ఆరుగాలం కష్టపడిన కౌలురైతులకు తీరని అన్యాయం జరిగింది. కౌలురైతులను ప్రభుత్వం ఏవిధంగా ఆదుకుంటుందో చెప్పాలంటూ రైతుసంఘాలు కోరుతున్నాయి. కౌలురైతులకు న్యాయం చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో దెబ్బతిన్న పంటలు

పంట వివరం	పంటనష్టం (ఎకరాల్లో)
వరి	47,657.50
మినుము	1,762.50
వేరుశెనగ	75
మొత్తం	49,495

ఏలూరు జిల్లాలో దెబ్బతిన్న పంటల వివరాలు

పంట వివరం	పంటనష్టం (ఎకరాల్లో)
వరి	22,045.33
మొక్కజొన్న	4,366.77
మినుము	241.38
పత్తి	2,181.67
వేరుశెనగ	938.75
పొగాకు	8,160.25
చెరకు	2
మొత్తం	37,936

విజయవాడలో ఎన్నికల సంఘం నిర్వహించిన జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిల సమావేశంలో పాల్గొన్న ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఎస్‌పి మేరీప్రశాంతి

ఎంపీల అక్రమ సస్పెన్షన్‌ను నిరసిస్తూ ధర్నాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నినదిస్తున్న నేతలు

పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీల ఎంపీలను అక్రమ సస్పెన్షన్ నిరసిస్తూ సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, భారత్ బచావో (ఇండియా ఫోరం) పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, ఆమ్‌ఆద్మీ అధ్యక్షులు షేక్ మస్తాన్, భారత్ బచావో అధ్యక్షుడు గుబ్బల నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంటులో దుండగుల దాడిపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష పార్టీల ఎంపీలను అధికార బిజెపి పార్లమెంటు నుండి సస్పెండ్ చేయడం దారుణమన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపీలు లేకుండా చేసి బిజెపి తనకు అవసరమైన బిల్లులను ఆమోదించుకుంటుందని విమర్శించారు. దాడి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపడితే బిజెపి బండారం బయటపడుతుందని ప్రధాని, హోం మంత్రులు భయపడుతున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా ప్రజాస్వామ్య పరిరక్షణకు లౌకిక రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్‌రావు, నగర కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.సోమయ్య, పివి.రామకృష్ణ, పి.ఆదిశేషు, బి.జగన్నాధరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ బండి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మన్నవ యామిని పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

జెసి లావణ్య వేణి

ప్రజాశక్తి - ముదినేపల్లి

అర్జీలు స్వీకరిస్తున్న జెసి లావణ్యవేణి

స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించి తగిన న్యాయం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. స్థానిక వి.కన్వెన్షన్ హాల్లో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి అధికారులు, సిబ్బంది మార్గదర్శకాలను పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వచ్చే అర్జీలను తగిన కారణం చూపుతూ తిరస్కరించాలని చెప్పారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు, సిబ్బంది విఫలమయ్యారని సున్నితంగా మందలించారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో సమస్యలపై అర్జీలు ఎక్కువ వస్తున్నాయని, వీటిలో ముఖ్యంగా శానిటేషన్, రైతుభరోసా, ఫిషరీస్, ఉపాధి హామీ, సివిల్ సప్లయిస్, పోలీస్, సర్వే, ఆక్వా చెరువులు, ఇతర సమస్యలపై ఉన్నాయని వివరించారు. వైవాక, వణుదుర్రు, పేరూరు గ్రామాల నుంచి వచ్చిన అర్జీలను సక్రమంగా పరిష్కరించకపోవడంపై జెసి అసహనం వ్యక్తం చేశారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి 66 అర్జీలు అందినట్లు తహశీల్దార్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, వ్యవసాయశాఖ జెడి వై.రామకృష్ణ, డిపిఒ టి.శ్రీనివాస విశ్వనాథ్, ఎంపిడిఒ పి.మల్లేశ్వరి, ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వివిధ శాఖల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగిన ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వినూత్న నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా మూడోరోజు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా కొనసాగించారు. కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ నినదించారు. ఈ ధర్నా శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు సందర్శించి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేస్తానని ఇచ్చిన వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జెఎసి నాయకులు భగవాన్, పౌల్‌రాజు, క్రాంతి, దిలీప్, బాలాజీ, రాజు సత్య, చినబాబు, వై.శ్రీనివాసరావు, వీరమణి పాల్గొన్నారు.

వినూత్న నిరసనలు.. నినాదాల హోరు

11వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులో మాట్లాడుతున్న ఎవి నాగేశ్వరరావు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మె శుక్రవారం 11వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఏలూరు కలెక్టరేట్ వద్ద నుంచి జిల్లా పరిషత్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళా పక్షపాతిని అని చెప్పుకునే జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. పైగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌ల పేరుతో పని భారం పెంచారన్నారు. అంగన్వాడీ కేంద్రాల అద్దెలు, గ్యాస్ బిల్లులు సకాలంలో చెల్లించడం లేదన్నారు. నెలలు తరబడి బకాయిలుంటే అంగన్వాడీలకిచ్చే కొద్దిపాటి జీతాలతో కేంద్రాలు ఎలా నడుపుతారని ప్రశ్నించారు. సకాలంలో సెంటర్ అద్దెలు చెల్లించడం చేతగాని ప్రభుత్వం ఈ రోజు సెంటర్ల తాళాలు పగులగొట్టడం దుర్మార్గమన్నారు. రాష్ట్రానికి తోడు కేంద్ర ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు ఒక్క రూపాయి జీతం పెంచలేదని విమర్శించారు. జాతీయ లేబర్ కమిషన్ సిఫార్సు ప్రకారం అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదలకు సేవలందిస్తున్న అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బడేటి చంటి సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. మూడు నెలల తర్వాత తమ ప్రభుత్వం వస్తుందని, అంగన్వాడీలకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టి.రజిని, సెక్టార్ లీడర్లు అరుణకుమారి, రెడ్డి రామలక్ష్మి, స్వప్న, పి.హైమావతి, ఆంతోనమ్మ, సిఐటియు నగరాధ్యక్షుడు బి.జగన్నాధరావు, నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: అంగన్వాడీలు స్థానిక పెదగాంధీ బొమ్మ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎన్ఆర్.హనుమాన్లు, జి.రాజు, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు ఆదిలక్ష్మి రాజకుమారి, నాయకులు పద్మ, వసుంధర, మణి, విజయలక్ష్మి, జ్యోతి, స్వర్ణకుమారి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

కైకలూరు: అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. అంగన్వాడీలు శుక్రవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం శిబిరం వద్ద కబడ్డీ, గొబ్బెమ్మ ఆటలాడి సినిమా పాటలు పాడి నిరసన వ్యక్తం చేశారు. వీరికి సిపిఎం, సిఐటియు, టిడిపి, జనసేన నేతలు మద్దతు తెలిపారు.

బుట్టాయగూడెం: అంగన్వాడీల సమ్మెపై మంత్రి ఉషశ్రీ చరణ్, ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బుట్టాయగూడెంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి, సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘాల నేతలు కారం భాస్కర్, రామలక్ష్మి, నూర్జహన్, మరియమ్మ, ఆకాశమ్మ పాల్గొన్నారు.

ఉంగుటూరు: అంగన్వాడీలు స్థానిక సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. తొలుత ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణరావు, నేతలు సీరా అప్పారావు, అంగన్వాడీ నేతలు సుజాత, ఝాన్సీ, డి.వెంకటలక్ష్మి, జి.రత్నం, ఎం.శాంతకుమారి, అనురాధ, పద్మ, సత్యవతి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: గౌరవవేతనం మాకొద్దు.. కనీస వేతనం కావాలి అంటూ స్థానిక మెయిన్ సెంటర్‌లో అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు అన్నమ్మ, అనూరాధ, పుల్లమ్మ, రూప, కరుణ, జ్యోతి, రాజ్యలక్ష్మీ, సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిపై మానవహారం చేపట్టారు. అంగన్వాడీల ఆందోళనకు సిఐటియు, బిజెపి నేతలతోపాటు తెలంగాణ అంగన్వాడీ నేతలు మద్దతు పలికారు. కార్యక్రమంలో పసుపులేటి కృష్ణమోహన్, ప్రసాద్, వెంకటలక్ష్మీ, కొండలరావు, నాగమణి, ఎస్తేరు, సరళ పాల్గొన్నారు.

టి.నరసాపురం: అంగన్వాడీలు స్థానిక అంబేద్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. అనంతరం కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించారు. సమ్మెకు మండల మహిళా నాయకురాలు మడకం కుమారి, అల్లూరి సీతారామరాజు నగర్ వాసులు మద్దతు తెలిపారు.

నిడమర్రు: స్థానిక మూడు రోజుల జంక్షన్లో అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. నిమ్మల పార్వతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు మాట్లాడారు. కార్యక్రమంలో సుభాషిని, నాగమణి, నాగేశ్వరి, ధనలక్ష్మి, విమల, రసూల్, సత్యవేణి, స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పోలవరం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద అంగన్వాడీలు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్ నేత కొణతాల ప్రసాద్, అంగన్వాడీ యూనియన్ నేత పిఎల్ఎస్.కుమారి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు పాల్గొన్నారు

మండవల్లి: అంగన్వాడీలు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అనంతరం మెయిన్ సెంటర్లో రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీలు వాణి, చెల్లమ్మ, విజయలక్ష్మి, ఉమాదేవి పాల్గొన్నారు.

చాట్రాయి: అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు సందర్శించి సంఘీభావం తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, సిపిఎం మండల నాయకులు చాగంటి రాజారావు, ఇవి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం అంగన్వాడీలు ర్యాలీగా మెయిన్ సెంటర్‌కు చేరుకుని మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో హేమలత, విజయ, మంగతాయారు, వరలక్ష్మి పాల్గొన్నారు.

చింతలపూడి: అంగన్వాడీలు ఎంపిడిఒ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ మాట్లాడారు. ఆయా సంఘాల నేతలు గంధం అంజమ్మ, సరోజిని, అంగన్వాడీలు అరుణ, కవిత, సరళ, మరియమ్మ విజయలక్ష్మి, సిఐటియు నాయకులు నత్త వెంకటేశ్వరరావు, బాలరాజు, జఫ్రుల్లా పాల్గొన్నారు.

ముసునూరు: అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించిన ఘనత సిఎం జగన్‌ది అని తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ విమర్శించారు. స్థానిక సచివాలయం వద్ద రహదారిపై అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో పల్లిపాము రాజకుమారి, దుర్గ, మేరి సులోచన, విద్యావతి, లక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

భీమడోలు: అంగన్వాడీలు భీమడోలు జంక్షన్లో రాస్తారోకో నిర్వహించారు. సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు సందర్శించి మాట్లాడారు. కార్యక్రమానికి యూనియన్ నాయకులు స్వర్ణ కుమారి, చెల్లామణి నాయకత్వం వహించారు.

జంగారెడ్డిగూడెం: అంగన్వాడీలు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్రశేషు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు సాయిల సత్యనారాయణ, అంగన్వాడీ నేతలు కె.జగదీశ్వరి, జి.విమల, పి.శాంతిశ్రీ, సత్యవేణి, ఎన్.దేవి, లక్ష్మిదేవి, విజయకుమారి, కె.సీత, శిరోమణి, సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

ముదినేపల్లి: స్థానిక గురజ రోడ్డు సెంటర్లో పెద్దసంఖ్యలో అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో పద్మ, మణి, అరుణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్న మాధవ పాల్గొన్నారు.

కలిదిండి: అంగన్వాడీలు స్థానిక బస్టాండ్ సెంటర్ నుండి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టి రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, సిఐటియు నాయకులు చిన్నం శ్రీకాంత్, అంగన్వాడీ నేతలు షేక్ అబిదాబేగం, జక్కంశెట్టి మేనకలక్ష్మి, కొప్పినీడి రమాదేవి పాల్గొన్నారు.

క్లాప్ ఆటోల డ్రైవర్లకు కనీస వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నినదిస్తున్న నేతలు, క్లాప్ ఆటో డ్రైవర్లు

క్లాప్ ఆటోల డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం అన్యాయమని, తక్షణమే క్లాప్ ఆటోల డ్రైవర్ల వేతనాలు జిఒ ప్రకారం పెంచి వారాంతపు సెలవులు, పండుగ సెలవులు, క్యాజువల్ లీవులు అమలు చేయాలని సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు బి.జగన్నాధరావు, వి.సాయిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద క్లాప్ ఆటోల డ్రైవర్లు ఏర్పాటు చేసిన రెండో రోజు రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. దీక్షల్లో కూర్చున్న వారికి మెడలో ఎర్ర రిబ్బన్లు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం ప్రభుత్వ సంస్థల్లోనే అమలు కాకపోతే కార్మికులు ఎలా బతుకుతారని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు తక్షణమే క్లాప్‌ఆటోల డ్రైవర్ల వేతనాలు పెంచి ఇతర చట్టబద్ధ రాయితీలు అమలు చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో క్లాప్ ఆటోల డ్రైవర్లకు మద్దతుగా తమ అనుబంధ సంఘాలన్నీ ఉద్యమ చేపడతాయని వారు హెచ్చరించారు. ఈ దీక్షా శిబిరం కార్యక్రమానికి యూనియన్ కార్యదర్శి జి.రాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి నాగేశ్వరరావు, నవీన్, జయరాం, కిషోర్‌కుమార్, ప్రదీప్, గణేష్, జైపాల్ నాయకత్వం వహించారు. రెండో రోజు దీక్షల్లో 18 మంది క్లాప్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. క్లాప్ ఆటోల డ్రైవర్ల నిరాహార దీక్షల శిబిరానికి సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, ఎల్ఐసి ఏజెంట్స్ యూనియన్ బ్రాంచ్ నాయకులు వైఎస్.కనకారావు, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎ.జాన్‌బాబు, డి.సోమరాజు విచ్చేసి సంఘీభావం తెలిపారు.

ఎన్ఇపితో విద్యారంగం సర్వనాశనం

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

నూతన విద్యా విధానంతో విద్యారంగం సర్వనాశనమవుతోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ విమర్శించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ శుక్రవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నామంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. పేద, బలహీన వర్గాల పిల్లలకు విద్య అందని ద్రాక్షగా మారుతోందన్నారు. ఏలూరులో ఇంతవరకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి సొంతభవనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. పీజీ సెంటర్ లేకపోవడం చాలా బాధాకరమన్నారు. స్థానిక అధికారులుగాని, అధికార పార్టీ నేతలుగాని దీన్ని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. డిగ్రీ కాలేజీ వచ్చి 15 సంవత్సరాలైన సొంతగూడు లేకపోవడం శోచనీయమన్నారు. వెంటనే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ పాల్గొన్నారు.

ఫీజు కట్టలేదని విద్యార్థిని కొట్టిన ప్రిన్సిపల్ భార్య

నూజివీడు రూరల్ : మీర్జాపురం న్యూ లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో శుక్రవారం ఆరో తరగతి చదువుతున్న త్రినాథ్ అనే విద్యార్థి ఫీజు కట్టలేదని ప్రిన్సిపల్ భార్య కొట్టగా కనుబొమ్మకి గాయమైంది. విషయం తెలుసుకున్న విద్యార్థి తండ్రి హనుమంతరావు 1902కి ఫిర్యాదు చేశాడు. విద్యార్థి త్రినాథ్‌కి నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. తండ్రి హనుమంతరావు వివరాల మేరకు ఫీజు కట్టాలంటూ గత కొంతకాలంగా విద్యార్థిని వేధిస్తున్నారన్నారు. ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నారని, ఆలస్యంగా ఫీజులు కడుతున్న వారిపై దౌర్జన్యం చేస్తున్నారని హనుమంతరావు వాపోయారు.

నేడు, రేపు హేలాపురి బాలోత్సవం

ఏలూరు అర్బన్ : బాలోత్సవాలను స్థానిక సురేష్ చంద్ర బహుగుణ (పోలీస్) స్కూల్‌లో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ కమిటీ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు తెలిపారు. ఏర్పాటు పూర్తయ్యాయన్నారు. ఈ బాలోత్సవాలలో అకాడమిక్, కల్చరల్ విభాగాల్లో సుమారుగా 69 అంశాలలో ప్రతిభా పాటవాలు ప్రదర్శించే అవకాశాలు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు షేక్ సాబ్జి స్మారక ప్రాంగణంగా బాలలోత్సవ ప్రాంగణానికి పేరు పెడుతున్నామని ప్రకటించారు. బాలోత్సవానికి జిల్లా విద్యా శాఖాధికారి పి.శ్యామ్ సుందర్, ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఐ.వేంకటేశ్వర రావు పాల్గొంటారని తెలిపారు. ఈ ఏర్పాట్లలో ఆనంద నాయుడు, వి.సురేష్, ఎం.అజయ్ బాబు, జి.శారద పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో మరిన్ని సేవలు

భీమడోలు : రైతు సేవా సహకార సంఘం రైతుల సంక్షేమం దృష్టిలో ఉంచుకొని మరిన్ని సేవలను అందజేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తుందని సంఘం అధ్యక్షులు రావిపాటి సత్య శ్రీనివాస్, ఎమ్‌డి ఆర్.రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సంఘం ప్రగతి గురించి వివరిస్తూ రూ.4,200 సభ్యత్వాలు, రెండు కోట్ల రూపాయల ఫిక్స్ డిపాజిట్లతో సంఘ నిర్వహణ జరుగుతుందన్నారు. సన్న, చిన్న కారు రైతులకు రూ.20 కోట్ల వరకు రుణాలు అందజేశామన్నారు. మల్టీపర్పస్ క్యాష్ అండ్ క్రెడిట్ లోన్ కింద రూ.2 కోట్ల వరకు అందజేశామన్నారు. రానున్న కాలంలో రైతుల సంక్షేమం దృష్టిలో ఉంచుకొని సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటు, తక్కువ ధరకే నాణ్యమైన మందులు అందించేందుకు జన ఔషధ(జనరిక్) మందుల షాపును పెట్టే ప్రతిపాదనలు ఉన్నట్లు ఆయన తెలిపారు.

ద్వారకాతిరుమలలో సినీ సందడి

ద్వారకాతిరుమల : ఫోర్ కె ఫిలిం ఫ్యాక్టరీ ద్వారా నూతన చిత్రాన్ని ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో శుక్రవారం ప్రారంభించినట్లు నిర్మాత పవన్ కుమార్ తెలిపారు. ద్వారకాతిరుమలలోని పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం నిర్మాత విలేకరులతో మాట్లాడారు. సందీప్ అద్వైత్ హీరోగా, కావేరి హీరోయిన్‌గా 'గ్రామ ప్రజలకు విజ్ఞప్తి' అనే సినిమాను ప్రారంభించినట్లు తెలిపారు. సాయి విజయ్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నారన్నారు. ఈ నూతన చిత్రానికి మంజులూరు జానకి ఫ్లాప్ కొట్టారు. ద్వారకాతిరుమల చిన్న వెంకన్నపై ఉన్న అపార భక్తితో ఆయన కొలువుదీరిన గ్రామంలో చిత్రీకరణ ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తరగళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

నూజివీడు రూరల్ : ప్రేమ వివాహం చేసుకున్న తమకు పెద్దల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ప్రేమ జంట పోలీసులను ఆశ్రయించారు. నూజివీడు మండలం మర్రిపూడి గ్రామానికి చెందిన ప్రేమజంట శుక్రవారం నూజివీడు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. వీరు మంగళగిరిలో వివాహం చేసుకోగా ఈ వివాహాన్ని పెళ్లి కుమార్తె వైపు పెద్దలు వ్యతిరేకిస్తున్నారు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ మాట్లాడుతూ ఇరు వర్గాల వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

ఎట్టకేలకు రహదారి పనులు ప్రారంభం

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం శివాలయం నుంచి అంకన్నగూడెం వరకు ఆర్ అండ్ బి రోడ్ ఎట్టకేలకు ప్రారంభమైంది. ఈ సందర్భంగా శుక్రవారం రూ.7 కోట్ల 45 లక్షల వ్యయంతో 22 కిలోమీటర్ల మేరకు రహదారి పనులకు పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని తెలుసుకొని వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డుని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆరేటి సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

చినవెంకన్న ఆలయంలో 'గిరిప్రదక్షిణ'

ద్వారకాతిరుమల : రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన దేవాలయాల్లో ఒకటైన శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ద్వారకాతిరుమల శ్రీవారిని గిరి ప్రదక్షిణ కార్యక్రమం శుక్రవారం అత్యంత అంగ రంగ వైభవంగా ప్రారంభమైంది. గిరిప్రదక్షిణ స్వామివారి మండపం నుంచి ప్రారంభమై దొరసాని పాడు టోల్ గేట్ మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో గోవింద స్వాములు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని గిరి ప్రదక్షణ చేశారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో సెమీ క్రిస్మస్

ముసునూరు : కాట్రేనిపాడు పంచాయతీ హరిచంద్రపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకను ప్రధాన ఉపాధ్యాయిని తూమాటి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని మాట్లాడుతూ ఏసుక్రీస్తు జన్మదిన సందర్భంగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 25వ తేదీన క్రిస్మస్ పండుగ జరుపుకుంటున్నారన్నారు. పాఠశాల ఉపాధ్యాయినిలు ఏర్పాటు చేసిన పాఠశాల విద్యార్థులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాఠశాల పరిధిలోని వృద్ధులకు, వితంతు మహిళలకు నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ వేడుకలో ఉపాధ్యాయులు కొప్పుల బాబూరావు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఇష్టపడి చదవాలి'

భీమడోలు : విద్యార్థులు కష్టపడి కాక ఇష్టపడి చదవడం ద్వారా లక్ష్యాలను సాధించవచ్చునని స్వచ్ఛంద సంస్థ మానవత చెందిన కెరియర్ గైడెన్స్ జిల్లా కమిటీ చైర్మన్ డాక్టర్ కోలారి రాధా పుష్పవతి తెలిపారు. భీమడోలు హైస్కూల్‌లో మానవత జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్తు ప్రణాళిక తయారీపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానవత జిల్లా కమిటీ సభ్యులు రామిశెట్టి గంగాధర రావు, కెరియర్ గైడెన్స్ కమిటీ జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి, భీమడోలు శాఖ చైర్మన్ గుండె సూరిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం విద్యలో ప్రతిభ కనబరిచిన పాఠశాలకు చెందిన ఆంగ్ల, తెలుగు మాధ్యమంలో చదువుతున్న షబీనా, రజిత, లక్ష్మీ దివ్య, డి.ప్రభాస్, దివ్యశ్రీ సాహితీ, దివ్య సాయిలకు సంస్థ తరఫున ప్రోత్సాహకంగా వారి విద్యాభ్యాసానికి ఆధారంగా బంగారు, రజత, కాంస్య పతకాలు, షీల్డు, పుస్తకాలను అతిథుల చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు సత్కరించారు.

పేదరిక నిర్మూలనే టిడిపి ధ్యేయం

కలిదిండి : పేదరిక నిర్మూలనే టిడిపి ధ్యేయమని రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదలంక పల్లెపాలెంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షులు గెల్లి శ్రీనివాస చక్రవర్తి పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి తెప్పోత్సవం

ముదినేపల్లి : మండలంలోని సింగరాయపాలెం సెంటర్‌లో జరుగుతున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారి తెప్పోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా బాణాసంచి కాల్చారు. ఈ సందర్భంగా ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ వెంకట్ కుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ తెప్పోత్సవంలో ఎంపిటిసి దూలం నాగేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో పివి రావు వర్ధంతి

ముదినేపల్లి : ముదినేపల్లిలో శుక్రవారం మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు క్రీశేషులు పివి రావు 18వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదినేపల్లిలోని రాష్ట్ర దళిత సంఘాల కార్యాలయంలో రాష్ట్ర మాల మహానాడు, అనుబంధ సంఘాల అధ్యక్షుడు డాక్టర్ సేవా నాగ జగన్ బాబురావు పివి.రావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

గణిత శాస్త్రానికే రాజు 'రామానుజన్'

ఘనంగా 136వ జయంతి

ప్రజాశక్తి - చింతలపూడి

శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రానికే రాజు అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అభివర్ణించారు. చింతలపూడి పట్టణంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రామానుజన్ 136వ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గణిత శాస్త్రానికి రామానుజన్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవనిగడ్డ భౌతికశాస్త్ర అధిపతి డాక్టర్ పి.బేబి సౌంధ్య మాట్లాడుతూ రామానుజన్ గొప్పతనాన్ని వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గణితశాస్త్ర విశిష్టతను తెలియజేశారు. రసాయనశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ బాల్యం, జీవితం, ఆయన గణిత శాస్త్రానికి చేసిన సేవల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



చింతలపూడి : డిగ్రీ కళాశాలలో రామానుజన్ జయంతి

భీమడోలు : సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

భీమడోలు : లెక్కలపట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంచేందుకు భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల స్థాయిలో నూతన కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ గణిత దినోత్సవ కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. తొలుత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించారు. గణితం కోసం ఆయన చేసిన కృషిని కరస్పాండెంట్ వివరించారు. ఆ తరువాత విద్యార్థులు గణితం అంశంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఏలూరు అర్బన్ : ప్రపంచ ప్రఖ్యాత గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 136వ జయంతిని పురస్కరించుకొని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నేషనల్ మ్యాథమెటిక్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన నేషనల్ వెబినార్‌లో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ మ్యాథమెటిక్స్ ను మదర్ ఆఫ్ ఆల్ సైన్సెస్‌గా పేర్కొన్నారు. నిత్యజీవితంలో తార్కిక ఆలోచనలకు గణితం పదును పెడుతుందన్నారు. అనంతరం ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.అజయ్ కుమార్, డాక్టర్ సిహెచ్.ఉదయలక్ష్మి, ఐక్యుఎసి కోఆర్డినేటర్ ఎం.కృష్ణచైతన్య పాల్గొన్నారు.

టి.నరసాపురం : లెక్కల మాంత్రికుడుగా పేరొందిన శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిఎల్.స్వామి అన్నారు. స్థానిక విజన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ హరికృష్ణ, విజయలక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

చాట్రాయి : జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పోలవరంలో ఘనంగా రామానుజన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు సిహెచ్.హీరేన్ ముఖర్జీ, బి.చెన్నారెడ్డి శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు మాట్లాడుతూ గణిత శాస్త్రంలో రామానుజన్ చేసిన ప్రయోగాలను వివరించారు. ఈ గణితోత్సవాలలో పాఠశాల ఉపాధ్యాయులు కేశవరెడ్డి, విజయ్ కుమార్, చంటి, కృష్ణారావు పాల్గొన్నారు.

ముసునూరు : గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో విద్యార్థులచే వృత్తం, చతురస్రం, త్రిభుజం ఆకృతి రూపాలను ప్రదర్శించడం గ్రామ ప్రజలను ఆకట్టుకుంది. శుక్రవారం మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస్ రామానుజన్ పుట్టినరోజు వేడుకలు సందర్భంగా గణిత ఉపాధ్యాయులైన నాగేశ్వరావు, రత్నమాల చిట్టిబాబు, వెంకటేశ్వ రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫ్రాన్సిస్, రమణ, అస్లాం పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక విద్యా వికాస్ విద్యాసంస్థల ప్రాంగణంలో రామానుజన్ జన్మదినం సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విద్యా వికాస్ విద్యార్థులు గణిత సూత్రాలను రంగవల్లులతో అలంకరించారు. అలాగే పలువురు విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన 250 ప్రదర్శనలను ప్రదర్శించారని విద్యా వికాస్ విద్యా సంస్థల డైరెక్టర్, కరస్పాండెంట్లు పి.సతీష్ చంద్, వి.శ్రీనివాసరావులు తెలిపారు.

ముసునూరు : త్రిభుజాకారంలో విద్యార్థులు

స్థానిక ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం విద్యార్థులు రామానుజన్ సంఖ్య 1729 ఆకారంలో ఒదిగి అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సరోజా రెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి ఉచిత కుట్టు శిక్షణ

టి.నరసాపురం : మహిళలు స్వయం ఉపాధి పొందడానికి ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాలు దోహదపడతాయని తిరుమల దేవిపేట ఎంపిటిసి-2 ఆళ్ల ఈశ్వరి తెలిపారు. మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం గ్రామంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశ్వరి మాట్లాడుతూ కుట్టుమిషన్ శిక్షణ పొందడం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తపన సేవా ప్రతినిధి శ్యాంసుందర్, మధ్యాహ్నపు నాగార్జున పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఐటిడిఎ పిఒ సూర్యతేజ

జీలుగుమిల్లి : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఐటిడిఎ పిఒ ఎమ్.సూర్యతేజ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బర్రింకల పాడు గిరిజన గురుకుల పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న జోనల్ స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన పలు క్రీడల్లో బర్రింకలపాడు గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో విద్యార్థులతో పాటు ప్రిన్సిపల్ పెద్దిరాజు, పీడీ రమేష్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇన్‌ఛార్జి నాగేశ్వరరావు, డివైఇఒ నీలయ్య పాల్గొన్నారు.

'సైకిల్‌పై శబరిమలై'

ఆగిరిపల్లి : దేవ అయ్యప్ప గురుస్వామి ఆధ్వర్యంలో ఆగిరిపల్లి నుంచి శబరిమలకు సైకిల్ యాత్రను ప్రారంభించారు. గత రెండుసార్లు సైకిల్ యాత్ర చేసిన అనుభవంతో మూడవసారి కూడా సైకిల్‌యాత్ర ద్వారా శబరిమలకు వెళ్తున్నట్లుగా గురుస్వామి తెలిపారు. ఈ సైకిల్ యాత్రలో స్వాములు కుప్పాల దుర్గా ప్రసాద్, రానిమేకల నాగరాజు, రాజమన్నార్ పాల్గొంటున్నట్లుగా తెలిపారు.

24న ఆడుదాం ఆంధ్రా 3కె రన్'

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు : ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌లో భాగంగా ఈనెల 24వ తేదీ ఆదివారం ఉదయం 6.30కు ఏలూరులో ఆడుదాం ఆంధ్ర 3కె రన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. వట్లూరు సర్ సిఆర్.రెడ్డి మహిళా కళాశాల సమీపంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు నుంచి ఇండోర్ స్టేడియం వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నూజివీడు రూరల్ : పట్టణంలో ఈనెల 23వ తేదీన త్రి కె రన్ నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎ ప్రతాప్ అప్పారావు నేతృత్వంలో ఆడుదాం ఆంధ్ర విజయవంతం కావాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి రాజు సర్కిల్ వరకు త్రి కె రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రంలోగా పేర్లు నమోదు చేసుకోవాలని, విజేతలకు నగదు బహుమతి ఉంటుందని తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

కలిదిండి : విద్య మాత్రమే తరువాత తరాలకు అందించే విలువైన ఆస్థి అని సర్పంచి పి.భోగేశ్వరరావు అన్నారు. మండలంలోని అమరావతి పంచాయతీ కొత్తూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందిన ట్యాబులను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు ఎఎస్ఎన్ బెనర్జీ, ఎంపిటిసి ఎన్.ఏడుకొండలు, పిఎంసి చైర్మన్ వై.ఈశ్వరి, వైస్ చైర్మన్ సిహెచ్ వినోద్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థినులకు ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు ట్యాబులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసిన ఘనత సిఎంకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ సర్వే పనులు ప్రారంభం

జీలుగుమిల్లి : మండలంలోని తాటియకులగూడెం నుంచి పట్టిసీమ వరకు జాతీయ రహదారి 365(బిబి) విస్తరణ పనులకు సంబంధించి శుక్రవారం సర్వే పనులు ప్రారంభించినట్లు జాతీయ రహదారుల సంస్థ అధికారి ఖాజాబాబు తెలిపారు. తాటియకులగూడెం నుంచి పట్టిసీమ వరకు మొత్తం 40.4 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్‌లు ఎమ్ఎస్ఎస్.రెడ్డి, అనసుద్ధిన్, అబ్రార్ విఆర్‌ఒలు మాధురి, బుల్లబ్బులు, జాతీయ రహదారి విస్తరణ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక చట్టాలకు మనుగడ ఉండదు : జెట్టి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎపి ల్యాండ్ టైటిల్ యాక్ట్ ప్రజా వ్యతిరేక చట్టమని ఇటువంటి చట్టాలు మనుగడ సాగించవని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ సెల్ అధ్యక్షుడు జెట్టి గురునాధరావు అన్నారు. శుక్రవారం ఎపి ల్యాండ్ టైటిల్ యాక్ట్‌కు వ్యతిరేకంగా జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షా శిబిరాన్ని గురునాధరావు సందర్శించి సంగీభావం తెలిపారు. ఈ దీక్షల్లో న్యాయవాదులు మాండ్రు మోహనరావు, బాషా శ్యాంబాబు, రాయి వసంతారావు, బొడ్డు వాసు, ఒగిరాల సర్వేశ్వరరావు, పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ధర్నాలో న్యాయవాదులు

ఏలూరు అర్బన్ : ఆంధ్రప్రదేశ్ భూ హక్కుల యాజమాన్య చట్టం 2022ను రద్దు చేయాలని కోరుతూ ఏలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పీడీ ప్రసాద్, సెక్రటరీ టి.సుబ్బారావు, సీనియర్ న్యాయవాది బివి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్థిరాస్తుల విషయంలో వివాదాలు ఏర్పడినప్పుడు ఆ వివాదాలను పరిష్కరించే అధికారం సివిల్ కోర్టుల పరిధి నుంచి తప్పించి ప్రభుత్వం ఏర్పాటు చేసే జిల్లాస్థాయి ట్రిబ్యునల్‌కు ఇవ్వటం వల్ల ట్రిబ్యునల్ ఉత్తర్వులపై నేరుగా హైకోర్టుకు మాత్రమే చేసుకునే అధికారాలు ఇచ్చారన్నారు. ఈ చట్టాన్ని ఉపసంహరించుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఏలూరు వెంకటేశ్వరరావు,ఎం.సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో 'ఆయుష్మాన్ భవ'

భీమడోలు : కోవిడ్ నేపథ్యంలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో విపత్తును ఎదుర్కొనేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంసిద్ధత కార్యక్రమం చేపట్టినట్లు ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ సునీత తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయుష్మాన్ భవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులతో పాటు మత్తు వైద్య నిపుణులు డాక్టర్ అశ్విని గర్భిణీలను పరీక్షించారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో అవసరం మేరకు కోవిడ్ చికిత్స కోసం అన్ని వసతులతో కూడిన ఏడు పడకల ప్రత్యేక వార్డు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇదేవిధంగా కోవిడ్ ప్రాథమిక నిర్ధారణకు అవసరమైన పరీక్షల నిర్వహణ కోసం, దానికి కావాల్సిన అవసరాలను సమకూర్చేందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావల్సి ఉందని తెలిపారు.

ఉపాధి పనులపై మేట్లకు శిక్షణ

నూజివీడు రూరల్ : పట్టణంలోని జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం కార్యక్రమంలో శుక్రవారం మేట్లకు(116 మంది) శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఫోన్ యాప్‌లో హాజరు, పండ్ల తోటల పెంపకం, అమృత సరోవర్ ట్యాంకుల నిర్మాణం, ట్రెంచ్ వర్కులపై అవగాహన కల్పించారు. కొలతలతో ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఎన్.సోమేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి పుట్టినరోజు

ఏలూరు టౌన్ : దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి జన్మదిన వేడుకలు దెందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు పాల్గొని అబ్బయ్యచౌదరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకకు జిల్లా వైసిపి నాయకులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు.

ఎస్ఐగా కె.జగ్గవరం యువతి ఎంపిక

టి.నరసాపురం : మండలంలోని కె.జగ్గవరం గ్రామానికి చెందిన యువతి పరసా రాధిక ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యారు. కె.జ గ్గవరం గ్రామానికి చెందిన పరసా ప్రసాదరావు, వేణమ్మ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్నపాటి వ్యవసాయం చేసుకుంటున్నారు. పేద కుటుంబానికి చెందిన రాధిక రెండో సంతానం కాగా ఇంజనీరింగ్ వరకు కష్టపడి చదివింది. ఎస్ఐ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న ఆమె ఎలాగైనా ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా సాధన చేసింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఎస్ఐగా ఎంపికైనట్లు కుటుంబీకులు తెలిపారు. ఎంపికైన ఆమెను సర్పంచి తడికలపూడి శివమాధవి అభినందించారు.

2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : జెసి

ఏలూరు : జిల్లాలో ఖరీఫ్ ధాన్యం ఇంతవరకు రూ.480 కోట్ల విలువైన 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. శుక్రవారం సాయంత్రం జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడుతూ అందులో ఇంతవరకు రైతులకు రూ.460 కోట్లు చెల్లించామన్నారు. ఇటీవల తుపాను నేపథ్యంలో దెబ్బతిన్న పంటల ఎన్యూమరేషన్ పూర్తయిందని, సంబంధిత పంటనష్టపోయిన వివరాల జాబితాను గ్రామ, మండల స్థాయిలో నోటీస్ బోర్డులో ప్రదర్శించబడుతుందన్నారు. అనంతరం జిల్లాలో తుపాను నేపథ్యంలో రాత్రి, పగలు రైతులకు అందుబాటులో ఉండి రైతులను ఆదుకొనేందుకు శాయశక్తులా కృషిచేసిన జిల్లా యంత్రాంగానికి జిల్లాస్థాయి వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, ఇతర సభ్యులు వెలిచేటి బాబ్జి, పల్లే రవీంద్రరెడ్డి, వి.హరిబాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సాయిబాలపద్మకు పలువురి సత్కారం

జంగారెడ్డిగూడెం : పట్టణానికి చెందిన వందనపు సాయి బాల పద్మను ప్రముఖులు ఘనంగా సత్కరించారు. వైసిపి ఏలూరు పార్లమెంట్ మహిళా విభాగం అధ్యక్షురాలు పదవికి ఎంపికైన ఆమెను శుక్రవారం పట్టణానికి చెందిన వర్తక, వాణిజ్య వ్యాపారవేత్తలు సాయిబాల పద్మ దంపతులను ఘనంగా సత్కరించి, మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కిరణా వర్తక సంఘ అధ్యక్షులు ఉప్పల రవికుమార్, కార్యదర్శి కొల్లేపుర ఆనంద్ పాల్గొన్నారు.

గ్రూప్-2 మెటీరియల్ అందజేత

బుట్టాయగూడెం : ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రూప్-2 ఫ్రీ మెటీరియల్ శుక్రవారం అల్లూరి సీతారామరాజు ఆదివాసి విజ్ఞాన కేంద్రం భవన వద్ద జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ వజ్ర కిరణ్ చేతులు మీదుగా నిరుద్యోగ యువతకి అందించారు. గ్రూపులో పెట్టిన మెసేజ్ ఆధారంగా 350 మందికి గ్రూప్-2 ఫ్రీ మెటీరియల్స్‌ను ఇవ్వడం జరిగిందన్నారు. మెటీరియల్ కావలసినవారు ఆదివాసి విజ్ఞాన కేంద్రం భవన వద్ద వచ్చి తీసుకోగలరని తెలిపారు. ఈ నెంబర్లకు 6305977689, 8328089902 సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **NANNETI ANANDA KUMAR** S/o. Nanneti Jayapaul, Residing at DNo. 2-78, Ambedkar Colony, Kummara purugu Palem North, Mogaltur mandal, W.G.Dt. A.P. I have changed my name from **NANNETI ANANDA RAO,** (Old name) to **NANNETI ANANDA KUMAR** (New name) hence forth I am being called **NANNETI ANANDA KUMAR** S/o. Nanneti Jayapaul for all purposes

పాస్‌పోర్టు పోయినది

గణపవరం మండలం, మొయ్యేరు గ్రామమునకు చెందిన కోరం వీరస్వామి, భార్య రిబక అను నేను మొయ్యేరు నుండి గణపవరం వచ్చి నా యొక్క పాస్‌పోర్టు నెంబరు **H3595332** పాస్‌పోర్టును జిరాక్స్ తీయించుకుని జిరాక్స్ మరియు ఒరిజినల్ పాస్‌పోర్టును కవర్లో పెట్టుకుని బండివై గణపవరం నుండి మొయ్యేరు వెళ్లే దారిలో కవర్‌తో సహా మార్గమధ్యలో పడిపోయినది. దారిలో ఎంత వెతికిన దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

కోరం రిబక
భర్త: వీరస్వామి
మొయ్యేరు గ్రామం, గణపవరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 9121971215

ప్రకటన

నా క్లయింటు అయిన శ్రీ యద్దపల్లి ప్రభాకరరావు గారి కుమారుడు విజయ్‌కుమార్, బాలాజీపేట, రాజమహేంద్రవరం (రాజమండ్రి), ప్రస్తుతం హైదరాబాద్ అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు ది. 07-07-2010 సం॥ తేదీన తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ పరిధిలోని తాళ్ళముదునూరుపాడులో డోర్ నెం. 10-31-4/1, 2 గల రెండు పోర్షన్ల డాబా కలిగిన 150 చ॥గ॥ల స్థలమును దస్తావేజు నెం. 4306/2010 గా గింజాల అప్పారావు గారి వద్ద క్రయం పొందియున్నారు. అదేరోజున నా క్లయింటు వారి యొక్క దస్తావేజు నెం. 4311/1988, తేది. 16-11-1988 ఒరిజినల్ ఇచ్చియున్నారని, దరిమిలా సదరు ఒరిజినల్ దస్తావేజు నెం. 4311/1988 ఒరిజినల్ డిసెంబర్ నెల మొదటి వారంలో తాడేపల్లిగూడెం తాలూకా సెంటర్ వద్ద జిరాక్స్ చేయించుకున్న దర్మిలా తాళ్ళముదునూరుపాడులో గల ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినదని తెలుసుకుని తిరిగి వెనక్కి వెళ్ళి ఎంత వెతికినను కనిపించియుండలేదని తెలియజేసినారు. ఈ రోజు వరకు కనిపించలేదని, సదరు దస్తావేజు నెం. 4311/1988 ఎవ్వరికైనా దొరికిన యెడల తిరిగి నా క్లయింటు అడ్రస్సుకు గానీ, నా యొక్క అడ్రస్సుకి గాని ఇవ్వగలరు.

కె.వి.పి.మాధవరావు
అడ్వకేట్, నోటరీ, ఏలూరు
సెల్: 944011033

మహారాజశ్రీ కొత్తగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టునందు
O.S. No.187/2023

Between:-
పిల్లం వెంకటేశ్వర రావు ...వాది
మరియు
1)మాగంటి వెంకటలక్ష్మీ
2)జంగలి సత్యవతి
3)మాగంటి రామలక్ష్మీ
4)మద్దుల సునీత ...ప్రతివాదులు

To,
1)మాగంటి వెంకటలక్ష్మీ, భర్త:లేటు బాబురావు, వయస్సు:58 సం॥లు, వృత్తి:గృహిణి, నివాసం:ఇంటి నెం.1-01సి, తాటికాకులగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా.
2)జంగలి సత్యవతి, భర్త:సురేష్, వయస్సు: 40 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇంటి నెం.1-02, తాటికాకులగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా.
3)మాగంటి రామలక్ష్మీ, భర్త:సిద్దు, వయస్సు:36 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం:ఇంటి నెం.1-01సి, తాటికాకులగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా.
4)మద్దుల సునీత, భర్త:శ్రీనివాస్, వయస్సు: 34 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: బండివారిగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా.

వాది మీపై పైన తెలిపిన దావా దాఖలు చేసియున్నారు. దావాపై మీకు ఎటువంటి అభ్యంతరాలు ఉన్నచో మీరు ది.12-01-2024 తేదీన ఉదయం 10-30 గం॥లకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ లేదా మీ ప్లీడర్ గారి ద్వారా గానీ హాజరై అభ్యంతరములు చెప్పుకోగలరు. లేని యెడల మీ పరోక్షములో తీర్మానం చేయబడుతుందని తెలియజేయడమైనది.

// కోర్టువారి అనుమతితో//
వాయిదా తేదీ:12-01-2024
కొత్తగూడెం,
18-12-2023

ఇట్లు
లక్కినేని సత్యనారాయణ,
న్యాయవాది-కొత్తగూడెం.

ఆస్థి వేలం

పశ్చిమగోదావరి జిల్లా అఫిషియల్ రిశీవరు గారి వల్ల జరుపబడు స్థిరాస్థి వేలం యిస్తిహారు, పశ్చిమగోదావరి జిల్లా అఫిషియల్ రిశీవరు గారి ఆఫీసులో
ఓ.ఆర్.ఐ.నెం.పీ. 1/2023
ఇన్
ఐపీ నెం. 34/2010 TPGSC

Between
Sri Paturi Ramachandra Rao .... Petitioner
and
Gaggara Hareramakrishna & others ..Respondents

వేలం యిస్థిహారు

ఈ క్రింద ఉదహరించు సొత్తులో ఇన్‌సాల్వెంటుకు గల హక్కు బాధ్యత సంబంధమును ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లా, అఫిషియల్ రిశీవరు గారు తమ ఆఫీసులో ఏలూరులో ది.12-01-2024 ఉదయం 10-30 గం॥లకు మొదలు బహిరంగముగా వేలంలో విక్రయించుదురు.

వేలము యొక్క నిబంధనలు

1. పాటదారు సర్కారు వారి పాటకంటే ఎక్కువ మొత్తమునకు పాడవలయును. ఎవరు ఎక్కువ మొత్తమునకు అడుగుచున్నారో వారి పక్షమున సాధారణముగా ముగింపు చేయబడును.
2. ఖరీదుదారుడు తన పక్షమున ముగింపు అయిన తక్షణమే నూటికి 25 రూపాయలు చొప్పున పైకము చెల్లించవలయును. మిగిలిన మొత్తమును ఆ తేదీ లగాయితు 15 రోజులలోగా చెల్లించవలయును. ఖరీదుదారుడు మిగిలిన మొత్తమును చెల్లించని పక్షమున తాను చెల్లించిన పైకము ఇన్సాల్వెంట్ యొక్క ఎస్టేటుకు దండుగ క్రింద చేరిపోవును, మరిన్ని పైకము చెల్లించక తప్పిన వారి యొక్క జవాబుదారి పైన నోటీసు లేకుండా సొత్తును మరలా వేలము వేయబడిన అందుమూలముగా సంభవించు, నష్టమునకున్ను, ఖర్చులకును తాను జవాబుదారుడై యుండగలడు. సొమ్ము చెల్లింపక తప్పిన వారికి సొమ్ము యందు గాని, లేక దరిమిలా అమ్మబడిన పైకములో ఏ భాగమందైనను ఎలాంటి బాధ్యతగాని యుండనేరదు.
3. లోపాలోపములకు లోబడియే వేలము జరుపబడుచున్నది. వేలము పాడుటకు ఉద్దేశించువారు సొత్తు పైన ఇందుగల అన్ని తగాయిదాలు విషయమై కావలసిన విచారణలు చేయవలయును. వారలు వేలంలో పాడుటను బట్టి అన్ని తగాయిదాలు లోపాలోపములు పూర్తిగా తెలిసియే పాడినట్లు యెంచబడును. సొత్తులకు సంబంధించిన దస్తావేజులను వేలము తేదీ ముందు రోజు ఏలూరులో అఫిషియల్ రిశీవరు ఆఫీసులో తనిఖీ చేయవచ్చును.
4. ఎక్కువ పాటను కారణము చెప్పకయే తోసివేయు అధికారము అఫిషియల్ రిశీవరు గారికి కలదు. ఏలూరులో అఫిషియల్ రిశీవరు ఎక్కువ పాటను తొడనే అంగీకరింపవచ్చును. లేక వేలమును వేరొక దినమునకు నిలిపి పెట్టవచ్చును. వేలము ముగింపు చేయుటకు, స్థిరపరచుటయు, అఫిషియల్ రిశీవరు యొక్క ఇష్టమునునుసరించి యున్నది.
5. వేలపు తేదీ లగాయితు సొత్తుకు సంబంధించి అన్ని పన్నులు, సెస్సులు ఖరీదుదారుడు చెల్లింపవలెను. కొనుగోలు మొత్తమును యావత్తు చెల్లించి వేలము తన పక్షమున ఖాయపరిచిన గాని అతడు సొత్తులో ప్రవేశింపకూడదు.
6. క్రయదారుడు తన జవాబుదారీ మీదను విక్రయ పత్రము వ్రాయించుకొని రిజిష్టరు చేయించుకొనవలెను.
7. సొత్తులు పదులుగా గాని, లేక లాట్లుగా గాని నోటీసు లేకయే సందర్భాను సారముగా విక్రయించుటకు అఫిషియల్ రిశీవరు గారి యందు అధికారము ఉంచుకొనబడియున్నది.
8. ఈ క్రింది నిబంధనలు సామాన్యముగా అన్ని వేలములకు వర్తించును. ప్రతిపాటకు కావలసిన యితర విశేషనిబంధనలను వేలం కాలములో గుర్తించబడును.

SCHEDULE : An extent of zeroyat dry land Ac.1-25 cents in RS No.58/2 situated in Kavuluru H/o. Ananthapalli, Ananthapalli Sub Division, Nallajerla Mandal, West Godavari District is bounded by :
East : Land of Bolla Chinnarao and others
South : Kongavarigudem Kaluva
West : Land of Karuturi Ammiraju
North : Land of Karuturi Nirmala
Official Reciver: West Godavari District, ELURU, A.P.